జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

నిజామాబాద్ శుక్రవారం 7 ఆగస్టు 2026 సంపుటి : 16 సంచిక : 186 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.41 । సూర్యాస్తమయం: 6.24 చంద్రోదయం: 12.47 । చంద్రాస్తమయం: 1.16 తిథి: బహుళ నవమి మ. 1.33 వరకు, తదుపరి దశమి నక్షత్రం: కృత్తిక సా. 4.52 వరకు, తదుపరి రోహిణి యోగం: వ్యాఘాతం ఉ. 11.19 వరకు, తదుపరి ధృవం కరణం: గరజి మ. 1.33 వరకు, తదుపరి వణిజ రా. 12.23 వరకు, తదుపరి భద్ర

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# పైన పటారం... లోన లొటారం




## లీకేజీలతో ఊడిపడుతున్న ఆసుపత్రి పైపెచ్చులు..

## మురుగునీటిలోనే ఆసుపత్రికి రాకపోకలు.. వైద్యం కోసం వెళ్తే ప్రాణాలకు ముప్పు.

## ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం దుస్థితిపై మండిపడుతున్న ప్రజలు.

**ఎడపల్లి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి)**

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రస్తుతం అధ్వాన్న స్థితికి చేరుకుంది. బయటకు చూస్తే భవనం బాగానే కనిపిస్తున్నా, లోపల అడుగుపెడితే అసలు పరిస్థితి అర్థమవుతోంది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఆసుపత్రి భవనం పూర్తిగా లీకేజీలతో నిండిపోగా, పైకప్పు పెచ్చులు ఊడి రోగులపై పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్లాబ్ నుంచి వర్షపు నీరు ధారాళంగా కారుతూ వార్డులు, చికిత్స గదులు తడిసి ముద్దవుతున్నాయి. పైకప్పు పెచ్చులు ఊడి రోగులపై పడుతుండటంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు ప్రాణభయంతో వైద్యం చేయించుకునే పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో రోగులు, వారి కుటుంబ సభ్యులు గడుపుతున్నారు. మరోవైపు ఆసుపత్రి ప్రధాన ద్వారం ముందు ఉన్న డ్రైనేజీ పూర్తిగా చెత్తాచెదారంతో మూసుకుపోవడంతో మురుగునీరు ఆసుపత్రి ఆవరణలోకి చేరుతోంది. దీంతో రోగులు, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు మురికినీటిలో నడుచుకుంటూ ఆసుపత్రిలోకి వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఆరోగ్యం మెరుగుపడాల్సింది పోయి కొత్త వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన - మిగతా 2లో









# వారు నాటుతున్నారు.... వీరు నరికి వేస్తున్నారు

## ఇది బాన్సువాడ నియోజకవర్గంలోని అవెన్యూ ప్లాంటేషన్ దుస్థితి

**బీర్కూర్, ప్రజాజ్యోతి ఆగస్టు 06:**

తెలంగాణ రాష్ట్రంలో అంతరించిపోతున్న పచ్చదనాన్ని కాపాడడానికి గత గులాబీ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల32 కోట్ల మొక్కలను ప్రతి గ్రామంలో నాటారు. కొన్నిచోట్ల అవెన్యూ ప్లాంటేషన్ అంటే గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీలు, ఎంపీడీవోలు, ఏపీ ఓలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. కానీ గులాబీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలు వృక్షాలుగా పెరిగి పచ్చదనాన్ని అందిస్తున్న సమయంలో కొంతమంది తమ పొలాలకు అడ్డం వస్తుందని నరికి వేస్తుండగా, మరికొన్నిచోట్ల నిప్పు పెట్టి పచ్చని మొక్కలను కాల్చి వేస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఇంకా విద్యుత్ శాఖ అధికారుల తీరు మరో విధంగా ఉంది.. చీమ చీమ ఎందుకు కుట్టావు.. - మిగతా 2లో



# ప్లాస్టిక్ రహిత గ్రామాలే ఆరోగ్యకర సమాజానికి పునాది

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజాజ్యోతి)**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామాల ఏర్పాటులో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, ప్రతి ఇంటికి జ్యూట్ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల సారాన్ని దెబ్బతీయడంతో పాటు నీటి వనరులను కలుషితం చేస్తున్నాయని తెలిపారు. పశువులు ప్లాస్టిక్‌ను తినడం వల్ల వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని, ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల వెలువడే విషపూరిత వాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా కాలువలు మూసుకుపోయి పారిశుధ్య సమస్యలు, దోమల వ్యాప్తి, వివిధ వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. జ్యూట్ సంచుల వినియోగం పర్యావరణ హితమని, ఇవి పునర్వినియోగానికి అనుకూలంగా ఉండటంతో పాటు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని తెలిపారు. ప్రతి కుటుంబం మార్కెట్‌కు వెళ్లేటప్పుడు జ్యూట్ సంచులను తప్పనిసరిగా వినియోగించి, ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులకు పూర్తిగా స్వస్తి పలకాలని - మిగతా 2లో

# శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం

## ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)**

మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తాడ్వాయి మండలంలోని ఎర్రపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం, అలాగే "బేటీ బచావో -- బేటీ పడావో" కార్యక్రమంలో భాగంగా బేబీ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, నవజాత శిశువుకు తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని తెలిపారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. తల్లులు మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, డబ్బా పాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని సూచించారు. ప్రజా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్లను బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిపాల ప్రాముఖ్యతపై - మిగతా 2లో

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డికి సవాల్

## బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్



**బాల్కొండ, ప్రజా జ్యోతి ఆగస్టు 06** అంతనాడు లేదు,ఇంతనాడు లేదు, సంతనాడు పెట్టింది ముంతంత కొప్పులి అన్న సామెతకు తగ్గట్లు ఉంది మీ వ్యవహారం. మీరు 2017 లో ప్రారంభించినవి ఇంకా గట్టిగా మాట్లాడితే 2014లో ప్రారంభించినవి కూడా మంత్రి హోదాలో ఉండి కూడా పూర్తి చేయలేకపోయారు. పది సంవత్సరాలు తమరు అధికారంలో ఉండి ఐదు సంవత్సరాలు మంత్రి హోదాలో ఉండి మరో ఐదు సంవత్సరాలు సాక్షాత్తు మంత్రిగా ఉండి కూడా తమరు చేయాలేని పనులను ఓడిపోయిన నేను ఏ విధంగా చేయగలను పోలీసులు మరియు రెవెన్యూ అధికారుల మీద నేనేం పెత్తనాన్ని చలాయించాను మా ప్రభుత్వం ఉంది కదా అని బాధ్యతగా సమస్యల పట్ల ఎమ్మార్వోలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తే తమరే కదా లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేసింది మీలాగా మేమేమైనా నిర్బంధాలు చేశామా గంజాయి కేసులు పెట్టించామా అడిగిన వారి మీద, ప్రశ్నించిన వారి మీద పోలీసులతో దౌర్జన్యాలు చేయించామా ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో రాజకీయపరంగా ఒక్కటంటే ఒక్కటైనా ఖీ×= నమోదయిందా నేను మంత్రులను అడగొచ్చు కదా అని అంటున్నారు కదా నేను మంత్రులను అడిగితే తమరు మంత్రిగా ఉండి పని చేయకుండా ఎన్నికల ముందు బడ్జెట్ ఆమోదం లేని ప్రొసిడింగ్ లు ఇచ్చారు అని మంత్రిగా పనిచేయలేదు కానీ ఎన్నికల స్టంట్ లు వేశారని అంటున్నారు మీరు చేసిన వ్యవహారం అంతా కాదు. ప్రారంభమై ప్రోగ్రెస్ లో ఉన్న పనులను పూర్తి చేస్తున్నాం ఆ బాధ్యత నాదే. వాగులు వంకల మీద పెత్తనంటున్నారు కదా మీరు ఒక్క ట్రాక్టర్ ఇస్తున్న 6000 రూపాయలకు అమ్మిపిస్తే నేను 3000 రూపాయలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాను దీన్ని చూసి సునీల్ కు మంచి పేరు వస్తుందని కుళ్ళుతో, ఈర్షతో, కడుపునిండా విషంతో నీకు సంబంధించిన పత్రికల వాళ్లను పంపి ఇబ్బందులకు గురి చేసావు.ఆనాడు గ్రామ కమిటీలు డబ్బులు తీసుకున్న ఈనాడు గ్రామ కమిటీలు డబ్బులు తీసుకుంటున్నాయి దీనిని కూడా మాఫియాగా చిత్రీకరించే ప్రయత్నం చేశావు. ఆఖరికి నీ పాత ఇంటలిజెన్స్ ఆఫీసర్ ను కూడా నీ గుప్పిట్లో పెట్టుకొని నా మీద తప్పుడు నివేదికలు ఇప్పించావు తర్వాత ప్రభుత్వ విచారణలో అధికారి ఇచ్చిన నివేదికలని తప్పు అని తేలి అధికారిని ఇక్కడి నుండి బదిలీ చేసింది. ప్రజలు ఇప్పుడు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఎవరి పనులు వారు చేసుకుంటున్న మాట వాస్తవం కాదా ఒక్కసారి ప్రజల మధ్య తిరిగి చూడండి.అవును జిల్లా ఇంచార్జ్ మంత్రి గారి సిఫార్సులతో మా కార్యకర్తల అభీష్టం మేరకు గ్రామాలలో ఎక్కడెక్కడ సిసి రోడ్లు అవసరమో నా పరిధి మేరకు వారికి ఇప్పించాను. మీరు మంత్రిగా ఉండి ప్రజలకు కోట్ల రూపాయల బడ్జెట్ లేని స్పెషల్ ఫండ్ ప్రొసీడింగులు ఇచ్చి మోసం చేశారు. మీరు రాష్ట్ర మంత్రిగా ఉండి కూడా ఆ పనులను చేయించలేకపోయారు నేను ఒక సామాన్య నియోజకవర్గ ఇన్చార్జిగా మీరు ఇచ్చిన తప్పుడు ప్రోసిడింగ్స్ ల బిల్లులు ఏ విధంగా ఇప్పించగలను.మీరు ప్రజలను అబద్ధంలో ఉంచి మభ్యపెట్టారు ప్రజలకు నిజాలు అర్థమయ్యేసరికి ఈ పార్టీకి అధికారం పోయింది మీకు అంధకారం మిగిలింది. మీకు అజమాయిసి, పెత్తనం పోయేసరికి నిత్యం ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మీరు ఎమ్మెల్యేనన్న సంగతి మర్చిపోతున్నారు.తమరు బాల్కొండ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అన్న సంగతి నేను పదే పదే మీకు గుర్తు చేస్తున్నాను మా ప్రభుత్వం గురించి తమరు విమర్శలు చేస్తున్నారు కదా ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం చాలా చేసింది ఇంకా చేస్తుంది.మా ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించింది అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులను అందించి సన్నబియ్యాన్ని ఇస్తుంది.ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ని అందిస్తున్నాం. రైతు రుణమాఫీ చేయడమే కాకుండా పెట్టుబడి సాయాన్ని అందిస్తూ సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ ప్రతి పంటకు మద్దతు ధరను అందిస్తున్నాం.మహిళా సంఘాలకు వడ్డీ వాపసు ఇవ్వడమే కాకుండా ఒక్కో సంఘానికి 10 లక్షల వరకు రుణం మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులు,పెట్రోల్ బంకులు ఇస్తున్నాం.మా ముఖ్యమంత్రి నాణ్యమైన విద్యపై దృష్టి పెట్టారు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు పబ్లిక్ స్కూల్లను నిర్మిస్తున్న మీ హయాంలో విచ్ఛిన్నమైన విద్య వ్యవస్థను ముఖ్యమంత్రి గారు పునర్నిర్మిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు గాని తండా గాని లేదు. కావలసిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తున్నాం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో అభివృద్ధి పథకాలను ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందిస్తుంది. మీరు పదే పదే ప్రభుత్వాన్ని విమర్శించడం మానండి ఎమ్మెల్యేగా కనీస బాధ్యతతో వ్యవహరించండి మీకు మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి గురించి, ప్రజల సమస్యల గురించి ప్రభుత్వాన్ని అడగాలనుకుంటే మీతో పాటు నేను కూడా వస్తాను నాకు ఎటువంటి భేషజాలాలు లేవు.

# ప్రజలకు వేగవంతమైన సేవలందించాలి

**జీపీవో లు, బిఎల్ఓ లకు ఆదేశం**



**ఇందల్వాయి, ఆగస్టు 06,( ప్రజా జ్యోతి ):** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా, వేగవంతంగా అందించడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ అధికారులు జీపీవో , బి.ఎల్.ఓ లు సూపర్‌వైజర్లు మరియు కార్యాలయ సెక్షన్ ఇన్‌ఛార్జీల సమక్షంలో ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని తహసీల్దార్ జి. బాలయ్య గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు పలు కీలక నిర్ణయాలు తీసుకుని సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

**సర్టిఫికేట్ల త్వరిత పరిష్కారం:**
కులం , నివాస , ఆదాయం , ఫ్యామిలీ మెంబర్, వంటి ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను జీపీఓలు తక్షణమే పరిశీలించి, విచారణ పూర్తి చేసి నివేదికలను కార్యాలయంలో సమర్పించాలని అయన సూచించారు.

**ఓటర్ల జాబితా సవరణలు:**
ఓటర్ల కార్డులలో పేరు తప్పులు, ఫోటోల మార్పులు, లింగం మార్పిడి తప్పులు (స్త్రీ/పురుష తప్పులు) సరిదిద్దాలి. అలాగే ఓటర్ల పుట్టిన తేదీ, మొబైల్ నంబర్లను క్షేత్రస్థాయిలో రీ-వెరిఫై చేసి అప్‌డేట్ చేయాలి.

**సార్ ఒ ఏఎస్డి జాబితా అప్‌లోడ్:**
ఏ ఎస్ డి జాబితా రూపకల్పనలో బూత్ లెవెల్ ఏజెంట్ల బిఎల్ఏ సంతకాలు తీసుకుని, సమావేశ మినిట్స్ నమోదు చేసి, ఫోటోలు తీసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

**వి ఐ పి ఓటర్ల పరిశీలన:**
గ్రామాలలో ప్రముఖుల (వి ఐ పి) ఓట్ల నమోదు ప్రక్రియ సరిగ్గా జరిగిందో లేదో బి ఎల్ ఓ లు, సూపర్‌వైజర్లు ప్రత్యేకంగా తనిఖీ చేయాలని తెలిపారు . ప్రజా సేవల్లో నిర్లక్ష్యం వహించకుండా, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు సూపర్‌వైజర్లు, జీపీవో లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పైన పటారం... లోన లొటారం..

-**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం కారణంగా డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రి ముందు ఉన్న డ్రైనేజీని వెంటనే శుభ్రం చేయించి మురుగునీరు ఆసుపత్రి ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, భవనంలోని లీకేజీలను శాశ్వతంగా మరమ్మతు చేసి రోగులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో వైద్య సేవలు అందేలా చూడాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం కొనసాగితే ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా దానికి బాధ్యత అధికారులదేనని హెచ్చరిస్తున్నారు.

# తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించిన బాచంపల్లి గ్రామం




**బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఆగస్టు 6** నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. జన్మించిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి మానసిక శరీరిక ఎదుగుదలకు తోడ్పడుతుందని తల్లిపాలు ఎంతో అవసరమని సులువుగా జీర్ణము అవుతుందని తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్లు రావని తల్లులు ఆరోగ్యంగా ఉంటారని పిల్లలు ఎదుగుదల పెరుగుతుందని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పౌష్టికాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు చారిష్మా సప్న , ఆయాలు, ఆశా కార్యకర్తలు గ్రామ సర్పంచ్ వన్నెల బాలామణి జనార్ధన్ ఉపసర్పంచ్ గంగామణి , గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు. తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేయించి,

# శ్రీ బాల త్రిపురసుందరి ఆలయంలో చండీహోమం

**సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు.**



**ఎడపల్లి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి భూమి సస్యశ్యామలంగా మారాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఎడపల్లి మండలం మంగళపాడ్ గ్రామంలోని శ్రీ బాల త్రిపురసుందరి దేవి ఆలయంలో గురువారం చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించిన ఈ మహాయజ్ఞంలో వేదపండితులు శ్రీప్రసాద్, శ్రీ అనంతశర్మ వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు జంగం సదానంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి.,ఈ సందర్భంగా లోకకళ్యాణం, దేశ సౌభాగ్యం, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, వ్యవసాయం అభివృద్ధి చెందాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. హోమంలో పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ.





**ఎడపల్లి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్ గ్రామ సర్పంచ్ పురమల్ల వినోద్ కుమార్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి చిన్నారులతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వారి విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ బాబా, వార్డు సభ్యుడు ప్రకాష్, యువజన సభ్యులు బండారి నర్సింలు, గొర్రె గంగాధర్, నరేందర్, దేవయ్య, అఖిల్, నాగేందర్, మల్లేష్, బట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ 92వ.జయంతిని నిర్వహించిన ఆర్డీవో ఎం. విజయ కుమారి




**ప్రజా జ్యోతి.బోధన్, ఆగస్టు 06.** బోధన్ ఆర్డీవో కార్యాలయంలో గురువారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని 92 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎం. విజయకుమార్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ప్రధాన సిద్ధాంతకర్తగా, విద్యావేత్తగా, గొప్ప భావజాల వ్యాప్తికుడిగా ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 6న ఆయన జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం ఆయన ఆశయాలకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో పేరు వెంకటేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ సాయిలు, రోహిత్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి



**ఇందల్వాయి, ఆగస్టు 06,(ప్రజా జ్యోతి):** కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరుతున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఎం.సి. పోచయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నవీన్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ, నాయకుడికి సముచిత స్థానం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా చైర్మన్ కాస్ప శ్రీనివాస్, ఇందల్వాయి సర్పంచ్ గంగామణి-గంగారం, పార్టీ నాయకులు ఆనంద్, బైరి రవి, అజయ్, నరేష్, నారాయణ, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఇందల్వాయి పిహెచ్‌సిలో కార్యక్రమం నిర్వహణ





**ఇందల్వాయి, ఆగస్టు 06, ( ప్రజా జ్యోతి ):** ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్ సీ ) ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహశీల్దార్ జి. బాలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవజాత శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు (ముర్రుపాలు) ఇవ్వడం ద్వారా వారికి రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని, ప్రతీ తల్లి కనీసం ఆరు నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. స్థానిక వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ ప్రభుత్వ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రములో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పద్మశారత్ రెడ్డి. కౌన్సిలర్లు

**ప్రజా జ్యోతి బోధన్ ఆగస్టు 6.** బోధన్ పట్టణంలోని వన మహోత్సవం ప్రభుత్వ కళాశాలలో ప్రహరీ గోడ వెంట మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తూము పద్మ శరత్ రెడ్డి గారు స్వయంగా మొక్కలు నాటి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. "ప్రజలందరూ తమ ఇళ్లలో, పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలి. కేవలం నాటడంతోనే సరిపెట్టకుండా, నాటిన ప్రతి మొక్కనూ బాధ్యతగా పెంచి పోషించి సంరక్షించాలి" అని ఆమె అందరికీ పిలుపునిచ్చారు. ఈ వనమహోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మరియు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పట్టణంలోని వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఆదినారాయణ దాము స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు మరియు పాఠశాల విద్యార్థినులు పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేశారు. తర్వాత మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పద్మ గారు జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి, ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా



చైర్‌పర్సన్ గారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పరితపించిన గొప్ప వ్యక్తి జయశంకర్ సార్ అని కొనియాడారు. ఆయన కలలుగన్న తెలంగాణ అభివృద్ధి కోసం, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకలలో మున్సిపల్ చైర్‌పర్సన్ గారితో పాటు మునిసిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ,అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బాల్కొండ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలి



**బాల్కొండ ప్రజా జ్యోతి ఆగస్టు 06** బాల్కొండ మండల కేంద్రంలో నీ కెసిఆర్ కాలనీలో నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బద్దం ప్రవీణ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.బాల్కొండ మండల కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ ల వద్ద విలేకరులతో మాట్లాడారు.గత ప్రభుత్వ హయాంలో స్థానిక శాసనసభ్యులు,మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో 176 ఇండ్లు నిర్మింప చేశారని అన్నారు. వాటిలో అప్పటి కెసిఆర్ గారి ప్రభుత్వమే 99 ఇండ్లను అర్హులకు పంపిణీ చేశామని చెప్పారు.మిగిలిన 77 ఇండ్లను వెంటనే అర్హులను గుర్తించి పంపిణీ చేయాలని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సునీల్ కుమార్ అసత్య ఆరోపణలు మానుకొని అర్హులకు మేలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో కిసాన్ నగర్ సర్పంచ్ రాంరాజ్ గౌడ్, మాజీ కోఅప్షన్ సభ్యులు మా.షాహిద్, ఫయాజ్ అలీ, మాజీ ఎంపీటీసీ నారాయణ, ఇఫ్తాకారోద్దీన్, కన్న పోశెట్టి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చిన్న బాల రాజేశ్వర్, కట్టెల శ్రీనివాస్ గౌడ్, భూసం కిట్టు, రహిమోద్దీన్, ఎర్రం సాగర్, మామిడి నర్సయ్య, తలారి రాజేందర్, ప్రసాద్, రాకేష్ తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ -- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ నెలవారి తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా గోదాంలో అమలవుతున్న భద్రతా ఏర్పాట్లు, ద్వంద్వ తాళాల విధానం, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాల అందుబాటు, సందర్శకుల నమోదు పుస్తకం, భద్రతా రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం గోదాంలో అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. గోదాంలో 24 గంటల భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలోఅదనపు కలెక్టర్ విక్టర్. అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్ వై గిరి. సంబంధిత ఎన్నికల శాఖ అధికారులు, గోదాం ఇన్‌చార్జి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆహారం

-మొదటిపేజీ తరువాయి

సమాజంలో మరింత అవగాహన కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం "బేటీ బచావో బేటీ పడావో" కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చిన తల్లులకు జిల్లా కలెక్టర్ బేబీ కిట్లను పంపిణీ చేశారు. ఆడబిడ్డ పుట్టుకను కుటుంబాలు ఆనందంగా స్వాగతిస్తూ, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లాలో ఈ తరహా బేబీ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని తొలిసారిగా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ యన్ వై గిరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ అరుణ్ భాస్కర్, కామారెడ్డి ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో కవిత, తహసీల్దార్ శ్వేత, వైద్యాధికారి డాక్టర్ కాశీ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, గ్రామ సర్పంచ్ మల్లవ్వ, జిల్లా మహిళా సాధికారత సిబ్బంది, పోషణ్ అభియాన్ సమన్వయకర్త, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సెల్ యాప్ అవగాహన

**-- ఏఓ భాను శ్రీ**



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)** అన్నారం రైతు వేదికలో భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సెల్ యాప్ ద్వారా అన్ని ఎరువుల కొనుగోలు గురించి మండల వ్యవసాయ అధికారి భాను శ్రీ అవగాహన కల్పించడం జరిగింది.ఇందులో భాగంగా యూరియా, డిఏపి, కాంప్లెక్స్ తదితర ఎరువులు ఫార్మర్ రిజిస్ట్రీ– ఫార్మర్ ఐడి, ఆధార్ కార్డు ద్వారా ఎలా బుక్ చేసుకోవాలో వివరించడం జరిగింది.వరి పంటకు బదులుగా ఆయిల్ పామ్ పంట సాగు పెంచాలని మరియు దాని వల్ల కలిగే లాభాల గురించి వివరించడం జరిగింది. ఫామ్ పాండు ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అన్నారం గ్రామ సర్పంచ్ లతా శ్రీనివాస్ గారు, ఉప సర్పంచ్ దయానంద్, పిఏసిఎస్ మాచారెడ్డి డైరెక్టర్ స్వామి గౌడ్ , అన్నారం క్లస్టర్ ఏఈఓ శిల్ప మరియు రైతులు పాల్గొన్నారు.

# ఇంద్రమ్మ మహిళా శక్తి సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం అందించిన చీరల పంపిణీ




**ప్రజా జ్యోతి బోధన్. 06.** తెలంగాణ ప్రభుత్వం ఇంద్రమ్మ మహిళా శక్తి సంఘాల సభ్యుల కోసం అందించిన చీరలను బోధన్ పట్టణంలో 14 వ వార్డ్ లోమున్సిపల్ చైర్మన్ తూము పద్మా శరత్ రెడ్డి జ్యోతి చిరంజీవి చేతుల మీద చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా శక్తి సంఘాల సభ్యులు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షుడు దాము జిల్లా ఉపాధ్యక్షులు పాషా మైనుద్దీన్ ఆదినారాయణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# టీజీఆర్‌లో ఉద్యోగ అవకాశం.

## బోధన్ ప్రదర్శనతో లెక్చరర్ నియామకం.

**ఎడపల్లి, ఆగస్ట్ 6 (ప్రజాజ్యోతి):** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల (బాలికలు), బోధన్--ఎడపల్లిలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ (బోటనీ) పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగా శంకర్ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బి.ఎడ్ లేదా సమాన అర్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపిక పూర్తిగా బోధనా ప్రదర్శన ఆధారంగా నిర్వహించబడుతుందని, ఎంపికైన అభ్యర్థులకు టీజీఆర్ విద్యాసంస్థల నిబంధనల మేరకు గౌరవ వేతనం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటాతో కలిసి ఈ నెల 8 వ తేదీన పాఠశాలలో జరిగే డెమోకు హాజరు కావాలని ఆయన సూచించారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామాలే ఆరోగ్యకర సమాజానికి పునాది



-మొదటిపేజీ తరువాయి

సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తమ ఇల్లు, గ్రామం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన గ్రామాల్లో విజయవంతంగా అమలు చేసి, అనంతరం జిల్లాలోని ఇతర గ్రామాలకు విస్తరించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థలు కలెక్టర్ ఎల్ వై గిరి. ఎంపీడీవో. తహసిల్దార్. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ఉచిత గొడుగుల పంపిణీ.



**ముప్కాల్, ప్రజా జ్యోతి, జూలై ( 6 )** వర్షాకాలం దృష్ట్యా విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి అండగా నిలిచేందుకు నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత గొడుగుల పంపిణీ చేపట్టారు. మండల అధికారులు, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు మరియు సిబ్బంది ఎండ, వానతో సంబంధం లేకుండా ప్రజా సేవలో నిమగ్నమైన వారికి చిన్న సహాయంగా ఈ గొడుగులను అందజేసినట్లు ఫౌండేషన్ ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఛైర్మన్ నాయకుడు సంతోష్, ఎంపీడీవో రమేష్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవీన్ హైస్కూల్లో బోనాల పండుగ



**బాల్కొండ, ప్రజాజ్యోతి ఆగస్టు06** బాల్కొండ మండల కేంద్రంలోని నవీన్ హైస్కూల్లో బోనాల పండుగ సంబరాలు నిర్వహించారు. బోనాలతో విద్యార్థులు, విద్యార్థులు గ్రామ పరిధిలో ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బోనాలను పెద్ద పోచమ్మకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకుల నరేందర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బోధన్ లో ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం...



**ప్రజాజ్యోతి బోధన్ ఆగస్టు 06..** ప్రభుత్వం చేపట్టిన వనమోత్సవం కార్యక్రమంలో భాగంగా బోధనలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మ శరత్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్ పాల్గొని మొక్కలు నాటారు ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

-- కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజాజ్యోతి)** అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఆగస్టు 15న ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారి కి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ యన్ వై గిరి. డి ఆర్ వో దామోదర్ రెడ్డి , వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయ అవగాహన సదస్సు

## -- ఏఈఓ రాకేష్ మినుకుల



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక రైతు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించడం జరిగింది. గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక రైతు అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించడం జరిగింది. వ్యవసాయ విస్తరణ అధికారి మినుకుల రాకేష్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సమావేశానికి గ్రామ ప్రజా ప్రతినిధులు మరియు రైతులు విచ్చేసి సదస్సును విజయవంతం చేశారు.?సదస్సులో చర్చించిన మరియు అవగాహన కల్పించిన

**ప్రధాన అంశాలు...!**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఎరువుల బుకింగ్ యాప్: రైతులు ఎరువులను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభంగా బుక్ చేసుకోవడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మొబైల్ యాప్ పనితీరు మరియు వినియోగ విధానంపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడం జరిగింది.ఫాం పాండ్ నిర్మాణం వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించడంలో ఫాం పాండ్స్ పాత్ర మరియు ఏ విధంగా తవ్వుకోవాలి మరియు వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించడం జరిగింది.

**ఆయిల్ పామ్ సాగు..!**

రైతులు ఆర్థికంగా స్థిరపడేందుకు దోహదపడే ఆయిల్ పామ్ సాగు విధానాలు, ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహకాలు మరియు లాభాల గురించి వివరించడం జరిగింది.ఈ సమావేశంలో రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రభుత్వ పథకాలను మరియు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో మెరుగైన లాభాలు సాధించాలని రైతులను కోరారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధు, జిపిఓ శ్రీకాంత్ , మల్లేష్ యాదవ్ , భూమయ్య, బాల రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణ లేక అధ్వాన్నంగా పశువుల నీటి తొట్టి



**డోంగ్లి ఆగస్టు 06 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలం లింబూర్ గ్రామంలో పశువుల నీటి తొట్టి నిర్వహణ లేక అధ్వానంగా మారింది. తొట్టిలో నాచు, పాకురు పేరుకుపోవడంతో నీరు కలుషితమై పశువులు తాగేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో పశువుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తొట్టిని శుభ్రం చేసి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

# నిశ్శబ్ధం నిలువరించకండి..!

## గుమ్మడి లక్ష్మీనారాయణ, సామాజిక విశ్లేషకుడు





**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)** "మాట వెండి అయితే, మౌనం బంగారం" అని మన పెద్దలు ఊరకనే చెప్పలేదు. ఆ మాట నేటి కాలంలో పని చేయదేమో! అనిపిస్తోంది. సాంకేతికత పెరిగిన కొద్దీ మనిషి జీవితంలో శబ్ధం కూడా అంతే వేగంగా పెరిగిపోయింది. ఒకప్పుడు ప్రకృతి మధ్య ప్రశాంతంగా గడిపిన మనిషి, ఇప్పుడు మొబైల్ ఫోన్లు, టెలివిజన్లు, వాహనాల హారన్‌లు, డీజే మోతలు, సోషల్ మీడియా నోటిఫికేషన్ల మధ్య తన ప్రశాంతతను కోల్పోతున్నాడు. ముఖ్యంగా యువత నిశ్శబ్ధాన్ని ఆస్వాదించడం కంటే శబ్ధంలోనే జీవించడం అలవాటు చేసుకుంటోంది. ఒక పరిమితిలో అవసరమైన చోట మాటల శబ్దం తప్పితే నిశ్శబ్ధమే ఆరోగ్యకరం! అయితే సంబంధిత నిపుణులు చెప్పేది పూర్తిగా భిన్నమైన విషయం. రోజుకు కనీసం 15 నుంచి 30 నిమిషాలైనా నిశ్శబ్ధంలో గడిపితే మెదడుకు విశ్రాంతి లభిస్తుందని వారు సూచిస్తున్నారు. దీంతో ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, దృష్టి కేంద్రీకరణ కూడా మెరుగుపడతాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మనసుకు నిశ్శబ్ధం కూడా అంతే అవసరం. 2021లో లో ప్రచురితమైన విశ్లేషణ ప్రకారం – ప్రకృతిలోని శబ్ధాలు అనగా పక్షుల కిలకిలా రావాలు, గాలికి ఆకులు సలసలలాడే స్వరం, ప్రవహించే నీటి గలగలలు, పెంపుడు జంతువుల సహజ ధ్వనులు వంటివి మనసుకు ఓ ఔషధంలా పనిచేస్తాయి. ఇవి మనలోని ఆందోళనను తగ్గించి, ప్రశాంతతను పెంచుతాయి. కానీ ఆధునిక జీవనశైలిలో ఇటువంటి సహజ వాతావరణం దొరకడం రోజురోజుకూ కష్టమవుతోంది. నగరాల్లో అయితే అది దాదాపు అసాధ్యంగా మారింది. దురదృష్టవ శాత్తూ, పల్లెటూళ్లలో కూడా పండు గలు, వేడుకలు, డీజేల మోతలతో ప్రశాంతత అరుదైపోతోంది. ఈ పరిస్థితుల్లోనే "సైలెన్స్ థెరపీ", "డిజిటల్ డీటాక్స్", "మెడిటేషన్ రిట్రీట్స్" వంటి భావనలు ప్రపం చవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతు న్నాయి. ఒకప్పుడు ఉచితంగా అందుబాటులో ఉన్న నిశ్శబ్ధాన్ని, ఇప్పుడు డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రావడం నిజంగా విచారకరం. ఇదే ఈ కాలంలోని అతిపెద్ద వ్యంగ్యం! ఒకప్పుడు అందరికీ సహజంగా లభించిన ప్రశాంతత, ఇప్పుడు ప్రీమియం సేవగా మారిపోయింది. మరోవైపు, నేటి సమాజంలో "బిజీ"గా కనిపించడం ఒక ఫ్యాషన్‌గా మారింది. నిజంగా పనిలో నిమగ్నమైన వారికంటే, ఎప్పుడూ స్మార్ట్‌ఫోన్ చేతిలో పట్టుకుని పనీ పాటా లేనివారు సైతం చాలా బిజీగా ఉన్నామని భావించే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. కానీ బిజీగా ఉండటం, ప్రయోజనకరంగా జీవించడం రెండూ ఒకటే కావు. కొంతసేపు ఫోన్‌ను పక్కన పెట్టి నిశ్శబ్ధంలో గడపగలగడం కూడా ఒక మంచి అలవాటు. ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో రెండో శుక్రవారం ప్రపంచ సైలెన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఆ రోజున నిశ్శబ్ధం గురించి గొప్పగా మాట్లాడుకుంటాం. అయితే అందులోనూ ఒక వ్యంగ్యం దాగి ఉంది. నిశ్శబ్ధం గురించి కూడా గట్టిగానే మాట్లాడుకోవడం! నిజానికి నిశ్శబ్ధం అనేది మాటల్లో చెప్పాల్సిన విషయం కాదు. అనుభవించాల్సిన అనుభూతి. 2013లో జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం – కేవలం రెండు నిమిషాల నిశ్శబ్ధం కూడా మెదడుకు విశ్రాంతిని అందించి, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిక శబ్ధ కాలుష్యం వల్ల నిద్రలేమి, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యల ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తోంది. మరోవైపు, ప్రకృతి లోని సహజ ధ్వనులు మానసిక ప్రశాంతతను పెంచుతాయని పలు శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడించాయి. విద్యార్థుల జీవితంలో నిశ్శబ్ధానికి మరింత ప్రాధాన్యం ఉంది. గ్రంథాలయాలు, రీడింగ్ రూములు, అధ్యయన కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం ఉండడం వల్లనే చదువుపై ఏకాగ్రత పెరిగి, జ్ఞాన సముపార్జన సులభమవుతుంది. ఇప్పటి కాంపిటేటివ్ కాలంలో జాబ్స్ పొందడంలో ఎంతో మంది నెగ్గగలుగుతున్నారు కూడా. నిశ్శబ్ధం అనేది కేవలం శబ్ధం లేకపోవడం మాత్రమే కాదు. అది ఆలోచనలకు, సృజనాత్మకతకు, విజ్ఞానానికి పునాది. చివరగా ... "మనిషి శబ్ధాన్ని నియంత్రిస్తున్నాడా? లేక శబ్ధమే మనిషిని నియంత్రిస్తున్నదా?" అనేది ప్రశ్నగా మిగలకూడదు. ఈ ప్రశ్నకు సమాధానం ప్రతి ఒక్కరి మనసులోనే ఉంది. అయితే ఆ సమాధానం ప్రస్ఫుటించాలంటే... కొద్దిసేపైనా నిశ్శబ్ధంతో స్నేహం చేయాల్సిందే. ఎందుకంటే... జీవితంలో కొన్ని గొప్ప సమాధానాలు శబ్ధంలో వినిపించవు. అవి నిశ్శబ్ధంలోనే పలుకుతాయి. పుణికిసలాడుతాయి.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

-- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** జిల్లా కలెక్టర్, కామారెడ్డి వారి అధ్యక్షతన ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సార్ –2026) కార్యక్రమంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల జిల్లా నాయకులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సార్ –2026 ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియ జుక్కల్, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలలో పూర్తయిందని మరియు కామారెడ్డి నియోజకవర్గములో కూడా 10.08.2026 లోపు పూర్తి అవుతుంది అని తెలిపారు. ఆదేవిదంగా పోలింగ్ స్టేషన్లను హేతుబద్ధీకరణ కూడా జరుగుతుందని, తదనంతరం వాటిని అప్రూవల్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కి పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీ వి. విక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), శ్రీ ఎన్.వై. గిరి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కామారెడ్డి తహశీల్దార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ (బీజేపీ), బీఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఎం, టీడీపీ, బీఎస్పీ తదితర రాజకీయ పార్టీల జిల్లా నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుకు స్పందన..

**బీర్కూర్ సహకార సంఘం సీఈఓ బదిలీ**

**డీసీఓ ఉత్తర్వులు జారీ -- రైతుల్లో హర్షం, పారదర్శక పాలనకు డిమాండ్**




**బీర్కూర్, ప్రజాజ్యోతి ఆగస్టు 6:** బీర్కూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓ విట్టల్‌కు బదిలీ ఉత్తర్వులు జారీ కావడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా సీఈఓ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు, ధాన్యం కొనుగోళ్లు, ఎల్‌టీఐ రుణాలు, పీఎఫ్ చెల్లింపులు, రుణమాఫీ అమలు తదితర అంశాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలుమార్లు మహాజన సభలు, జనరల్ బాడీ సమావేశాల్లో తీర్మానాలు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.ల ఈ నేపథ్యంలో బీర్కూర్ గ్రామానికి చెందిన సింగరేణి అశోక్, ఓంకార్, సాయిలు తదితరులు జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని జిల్లా సహకార అధికారి (డీసీఓ) రామన్‌రావును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన డీసీఓ రామన్‌రావు, సీఈఓ విట్టల్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడాన్ని రైతులు స్వాగతించారు. ఇకపై సహకార సంఘంలో పారదర్శక పాలన కొనసాగిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని వారు కోరారు.

## వారు నాటుతున్నారు.... వీరు నరికి వేస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి



అంటే నా పుట్టలో చేతులు పెడితే కుట్టనా, అన్ని చెందాక విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటితే అవి విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయంటూ సాకులు చూపుతూ రైస్ మిల్లర్లను కాపాడడానికి ట్రాన్స్కో అధికారులు అవెన్యూ ప్లాంటేషన్ వృక్షాలను నరికి వేస్తున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా బైరాపూర్ ప్రధాన రహదారి నుంచి పోతంగల్ వెళ్లే రహదారి పక్కన గత గులాబీ ప్రభుత్వంలో అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయి. అవి విద్యుత్తు తీగలకు ఆటంకం కలుగుతుందని ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు కిలోమీటర్ల వరకు అవెన్యూ ప్లాంటేషన్ చెట్లను నరికి వేశారు ట్రాన్స్కో అధికారులు. ఏమైనా అంటే తమ విద్యుత్తు తీగలకు వృక్షాలు అడ్డం వస్తుండడంతో వాటిని నరికి వేస్తున్నామని గర్వంగా చెప్పుకుంటున్నారు ట్రాన్స్కో శాఖలో పనిచేసే కొంతమంది అధికారులు. బైరాపూర్ నుంచి లింగాపూర్ వరకు పొతంగల్ రహదారిపై మూడు కిలోమీటర్ల వరకు ట్రాన్స్కో అధికారులు చెట్లను పూర్తిగా నరికి వేశారు. దీనిని అడ్డుకోవాల్సిన గ్రామపంచాయతీ అధికారులు, ఎంపీడీవో, ఎంపీ ఓలు ఆ వైపు దృష్టి పెట్టకపోవడంతో అవన్నీ ప్లాంటేషన్ కు ప్రమాదం ముంచుకొచ్చింది. ఇది ఇలా ఉండగా కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులో అవెన్యూ ప్లాంటేషన్ వృక్షాలను కొంతమంది రైస్ మిల్లర్లు యజమానులు విద్యుత్తు సరఫరాకు అడ్డం వస్తుందని నరికి వేస్తున్నారు . వాస్తవంగా ఇక్కడ విద్యుత్ స్తంభాలు పొలంలో నుంచి నాటాల్సి ఉండగా, ఉద్దేశపూర్వకంగా చెట్ల మధ్య నుంచి విద్యుత్ స్తంభాలు నాటారు. ప్రస్తుతం అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలుగా వృక్షాలుగా మారిపోయాయి. వాటిని సంరక్షించాల్సిన గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కొంతమంది చెట్లను విద్యుత్తు తీగలకు అడ్డం వస్తున్నాయని నరికి వేస్తున్నారు. వాటిని సంరక్షించడంలో గ్రామపంచాయతీలు నిర్లక్ష్యం చూపడంతో చాలాచోట్ల మొక్కలన్ని ఎండిపోయి కేవలం గోతులే దర్శమిస్తున్నాయి. పచ్చని చెట్లను ఇష్ట రాజ్యాంగ ట్రాన్స్కో అధికారులు నరికి వేస్తుంటే సంబంధిత శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారు. ఫలితం పచ్చని చెట్లు మాయమైపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులారా, కళ్ళు తెరవండి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పచ్చదనాన్ని కాపాడడానికి భాగ్యస్వాములు కావలసిన అవసరం ఎంతైనా ఉంది.

## పాఠశాల ప్రాంగణంలో గడ్డి మందు స్ప్రే



**బీర్కూర్, ప్రజాజ్యోతి ఆగస్టు 6:** కిష్టాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సర్పంచ్ మానెవ్వ గంగొండ, 2వ వార్డు సభ్యురాలు కుమ్మరి భాగ్య విఠల్ ఆధ్వర్యంలో గడ్డి మందు స్ప్రే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరిసరాల్లో కలుపు మొక్కలు పెరగకుండా, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంద గంగాధర్, చందు గౌడ్, పీరయ్య పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామ ప్రజలు, పాఠశాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..?




**క్యాసంపల్లి విద్యార్థుల ఆవేదన**

**ప్రత్యేక బస్సు కేటాయించాలని ధర్నా, రాస్తారోకో**

**గ్రామ సర్పంచ్ అడప శ్యామ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం**

**వారం రోజుల్లో బస్సు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ**

**కామారెడ్డి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** విద్యార్థులకు విద్య హక్కు అయితే, ఆ విద్యను అందుకునేందుకు అవసరమైన కనీస రవాణా సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అయితే కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామ విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు చిన్నారులు రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం నడిచి ప్రధాన రహదారికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో గురువారం గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

గ్రామ సర్పంచ్ అడప శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి కామారెడ్డి ఆర్టీసీ బస్సు డిపోకు చేరుకుని డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల ఇబ్బందులను వివరించి వెంటనే గ్రామానికి ప్రత్యేక బస్సు కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్యాసంపల్లి గ్రామం నుంచి ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, కోచింగ్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోంది. కానీ గ్రామానికి నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో చిన్నారులు తెల్లవారుజామునే ఇంటి నుంచి బయలుదేరి రెండు నుంచి మూడు కిలోమీటర్లు నడిచి బస్సు ఎక్కాల్సి వస్తోంది. వర్షాలు, ఎండలు, చలి వంటి ప్రతికూల వాతావరణంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల చాలా మంది విద్యార్థులు ప్రతిరోజూ ఆలస్యంగా పాఠశాలలకు చేరుకుంటున్నారు. దీంతో ముఖ్యమైన తరగతులు కోల్పోవడంతో పాటు చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాలికలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లడం భద్రతాపరంగా కూడా ఆందోళన కలిగిస్తోందని తల్లిదండ్రులు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అడప శ్యామ్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలంటే ముందుగా రవాణా సమస్య పరిష్కారం కావాలని అన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు అవసరమైతే మరిన్ని ఆందోళనలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలందరి తరఫున విద్యార్థులకు అండగా నిలబడతామని, వారి భవిష్యత్తు కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని తెలిపారు.

విద్యార్థులు మాట్లాడుతూ, ప్రతిరోజూ చాలా దూరం నడవడం వల్ల అలసటకు గురవుతున్నామని, సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక చదువులో వెనుకబడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన కామారెడ్డి ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ విద్యార్థుల సమస్యను సానుభూతితో పరిశీలిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం వారం రోజుల్లో క్యాసంపల్లి గ్రామానికి ప్రత్యేక బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అయితే అధికారులు ఇచ్చిన హామీని అమలు చేసి త్వరితగతిన ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. హామీ అమలు కాకపోతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడప శ్యామ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వార్డు సభ్యులు, పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

## -- సూపర్వైజర్ జ్యోతి



**కామారెడ్డి,ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని పలు సెంటర్ లలో తల్లిపాల వారోత్సవాలు, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమాలు మండల సూపర్వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి సెంటర్లలో బాలింతలకు ఆహారంపై పోషకాల విలువల పై బాలింతలకు అంగన్వాడి టీచర్లు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని, తల్లులు శిశువులకు సమృద్ధిగా పాలను అందించాలని తెలియజేశారు. బాలింతలు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే శిశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా రోగనిధుల శక్తి తట్టుకునే విధంగా ఉంటారని తద్వారా వయసుకు తగ్గట్టుగా బరువును తగ్గట్టుగా ఎత్తు ఉంటారని బాలింతలకు వివరించారు. నూతనంగా అంగన్వాడి సెంటర్ కు వస్తున్న చిన్నారులకు అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు (ఇస్సన్నపల్లి) సృజన,అనసూయ, ఆయా సెంటర్ల హెల్పర్లు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక





**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి రామం నుండి చిన్న వయసంలో రాష్ట సాయి పోటీలకు ఎంపిక్ కామారెడ్డి ఇందిరా గాంధీ క్రీడా ప్రాంగణం లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన1).దండబోయిన చాణక్య అండర్ -6 బంగారు.పతకం,అండర్ 6. 2).తన్నీరు సంవృద్ధి 3) జంగం దేవా,ఈ అండర్ -8, స్టాండింగ్ లాంగ్ జంప్ ప్రపర్ 7 నుండి 8 వ తేదీవరకు వరంగల్ స్టేడియం జరిగే రాష్ట్ర సాయి పోబీలకు రామారెడ్డి విధ్యార్థులు ఎంపిక అవ్వడం చాలా సంతోషంగా ఉందని ఫుట్బాల్ కోచ్ లు వేణు, అనీల్ కుమార్ రామారెడ్డి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ధర్మారావుపేట్ గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం

**--ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్య**

**--సర్పంచ్ షేక్ ఉమర్**

**సదాశివనగర్, ఆగస్టు 06 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాగింగ్ కార్యక్రమాన్ని సర్పంచ్ షేక్ ఉమర్. నిర్వహించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉండటంతో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని పలు వార్డుల్లో ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పంచాయతీ తరఫున నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.



## పశు వైద్యశాలపై పట్టింపు లేదా

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 6 (ప్రజాజ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రంలో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకున్న సందర్భంగా ఈ మధ్య కురుస్తున్న వర్షాల కు భవనం యొక్క పైచ్చులు ఉడుతు ప్రమాదంగా మారిన వైనం. ఏకంగా పశు వైద్య అధికారి పై తప్పిన పెను ప్రమాదం ముఖ్యంగా ఈ యొక్క మండల కేంద్రానికి చెందిన పశువైద్య కేంద్రానికి పశువులను రైతులు రోజుకు సుమారు 30 నుండి 40 పశువులను తీసుకువస్తుంటారు. ఈ యొక్క పశు వైద్యశాల శిథిలావస్థలో ఉండడం వలన పశువైద్య సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. గతంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ యొక్క భవనం శిథిలావస్థకు చేరుకోవడం వలన భవనం యొక్క పెచ్చులు ఊడి పడడంతో భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం జరిగింది. ఈ యొక్క సంఘటనలు అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఈ యొక్క భవాని నిర్మాణంపై ప్రత్యేక చరవ చూపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మండల పశువైద్యాధికారి తెలపడం జరిగింది. ఈ వర్షాకాల సందర్భంగా శిథిలావస్థలో ఉన్న భవనం పెచ్చులు ప్రమాదకరంగా మారింది ఈ యొక్క భవనానికి మరమ్మతులు చేయవలసిందిగా కోరడం జరిగింది.




## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ఆశయాలతో ప్రజాసేవలో ముందుకు సాగాలి

**: జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర**





**కామారెడ్డి టౌన్ ఆగస్టు 6 ప్రజా జ్యోతి** కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆచార్య ప్రొ. కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ కామారెడ్డి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసి, తెలంగాణ ఆకాంక్షను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని కామారెడ్డి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతకర్తగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని దేశ, విదేశాల్లో వివరించి ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన గొప్ప మేధావి, దార్శనికుడు జయశంకర్ సార్ అని పేర్కొన్నారు. ఆయన కేవలం ఒక విద్యావేత్త మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. యువత జయశంకర్ సార్ జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని, సమాజానికి సేవ చేయాలనే తపనతో ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే పోలీసింగ్ అందించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు స్నేహపూర్వక సేవలు అందించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుల త్యాగాలను గుర్తుంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అలాంటి మహనీయుల జయంతులు వారి ఆశయాలను గుర్తు చేసుకునే సందర్భాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కే. నరసింహారెడ్డి, డీఎస్పీ గట్టు మల్లు, సీఐ సంపత్, ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆచార్య జయశంకర్ సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

## ఈనెల 30 న హసన్ టాక్లికి మంద కృష్ణ మాదిగ రాక



**డోంగ్లి మండలం ఆగస్టు 06 ప్రజాజ్యోతి** కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలంలోని హసన్ టాక్లీ గ్రామంలో సాహిత్య సామ్రాట్, లోక్ షాహిర్ అన్నాభావు సాటె నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 30 వ తేదీన చేపడుతున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామజిక ఉద్యమ నాయకులు ఎంఆర్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ వీచ్చేస్తున్నట్లు హసన్ టాక్లీ గ్రామ సర్పంచ్ నక్కేవార్ దత్తు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైదరాబాద్ లోని తన నివాసంలో ఎంఆర్పీయస్ కామారెడ్డి జిల్లా ఇంచార్జి మంథని సామ్యేల్ మాదిగ నేతృత్వంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాదేపురం గంగన్న ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఈ కార్యక్రమానికి విచ్చేయవలసిందిగా ఆహ్వానించినట్లు సర్పంచ్ దత్తు తెలియజేశారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం అంటే వారిని స్మరించుకున్నట్లేనని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు నక్కేవార్ లాలు, బక్కావార్ సాయిలు, నక్కేవార్ మారుతి, సాయినాథ్, బోయి సతీష్, అంకుష్ తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని నిర్వహించిన సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ప్రతినిధులు



**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ ఉద్యమ మేధావి ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని జయశంకర్ కాలనీలో గురువారం సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ (స.హ.చ.) జిల్లా ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో పారదర్శకత, ప్రజాహక్కుల పరిరక్షణతో పాటు తెలంగాణ అభివృద్ధికి ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ గారి చేసిన త్యాగాలు, ఉద్యమానికి అందించిన మేధోబలం చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధి కోసం సేవాభావంతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వి. భాస్కర్, జిల్లా వక్త, న్యాయవాది ఈక శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సల్ల కృష్ణమూర్తి, ప్రతినిధులు రాజు, రవి, అన్వర్ గౌరీ తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఫీజుల బకాయిల విడుదల కోసం బీజేవైఎం పోరుబాట

రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సమావేశం

సంతకాల సేకరణ, మిస్డ్ కాల్ క్యాంపెయిన్‌కు విశేష స్పందన

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని

రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్



**కామారెడ్డి టౌన్ ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో రామారెడ్డి మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు నంది వేణు ఆదేశానుసారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య, దాని ప్రభావం, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నాయకులు సవివరంగా చర్చించారు.

ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వాలు విద్యార్థులకు అందించే హక్కు అని, అవి నెలల తరబడి బకాయిలుగా ఉండడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువును కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేయడం, పరీక్షలకు అనుమతుల విషయంలో విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు ఏర్పడటం దురదృష్టకరమని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు "ఫీజుల బకాయి... బీజేపీ లడాయి" నినాదానికి మద్దతు తెలుపుతూ పెద్ద ఎత్తున సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మిస్డ్ కాల్ క్యాంపెయిన్లో భాగంగా నిర్ణీత నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ ఉద్యమం విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ప్రజాస్వామ్య పోరాటమని బీజేవైఎం నాయకులు పేర్కొన్నారు.

ఫీజుల బకాయిల సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీజేవైఎం నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఫీజుల బకాయిలు విడుదలయ్యే వరకు ఉద్యమాన్ని విస్తరించి ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు, సంతకాల సేకరణ, వినతిపత్రాల సమర్పణ వంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు చౌకీ భరత్, జిల్లా కార్యదర్శి ఇసాయిపేట నరేష్, ఐటీ సెల్ మండల కన్వీనర్ గాండ్ల రాజేందర్, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

# బిచ్కుందలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు

**తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**బిచ్కుంద ప్రతినిధి ఆగస్టు 6 : (ప్రజా జ్యోతి )** బిచ్కుంద, కామారెడ్డి జిల్లా: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, తెలంగాణ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని బిచ్కుందలో ఘనంగా నిర్వహించారు.

గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, సిబ్బంది ఘన నివాళులు అర్పించారు.

**అధికారుల నివాళి:**

ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ "తెలంగాణ సాధనలో జయశంకర్ గారి పాత్ర అనిర్వచనీయం. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఆయన ఉద్యమానికి కొత్త ఊపు ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవలో ముందుండాలి" అని అన్నారు.

నాయబ్ తహసీల్దార్ భాస్కర్, గిర్దావర్ హన్మాండ్లు,ఈరా మరియు రెవెన్యూ సిబ్బంది జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

**జయశంకర్ ఆశయాలు:**

జయశంకర్ గారు విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన తీరును యువతకు ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో తెలంగాణను మరింత అభివృద్ధి చేయాలని వక్తలు పేర్కొన్నారు.

కార్యక్రమం అనంతరం అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.

# మృత్యువుతో పోరాడిన నెలలు నిండని శిశువుకు 108 నియోనేటల్ అంబులెన్స్ ప్రాణాధారం

కామారెడ్డి నుంచి హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి అత్యవసర తరలింపు

మూడున్నర గంటల పాటు అంబు బ్యాగ్, ఆక్సిజన్‌తో నిరంతర వైద్య సహాయం అందించిన 108 సిబ్బంది

శ్వాస తీసుకోలేని స్థితి, ఫిట్స్‌తో ప్రాణాపాయంలో ఉన్న శిశువును సురక్షితంగా చేర్చిన ఈఎంటీ కృష్ణస్వామి, పైలట్ విజయ్‌కుమార్ సేవలకు తల్లిదండ్రుల కృతజ్ఞతలు



**కామారెడ్డి, టౌన్ ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** సమయానికి అందిన 108 అత్యవసర వైద్య సేవలు మరో నవజాత శిశువు ప్రాణాలను కాపాడే దిశగా కీలక పాత్ర పోషించాయి. నెలలు నిండక ముందే జన్మించిన శిశువు తీవ్ర శ్వాసకోశ సమస్య, ఫిట్స్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉండగా కామారెడ్డి 108 నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది అసాధారణ అప్రమత్తతతో వ్యవహరించి మూడున్నర గంటల పాటు నిరంతర వైద్య సహాయం అందిస్తూ హైదరాబాద్‌లోని నిలోఫర్ ప్రభుత్వ చిన్నారుల ఆస్పత్రికి సురక్షితంగా తరలించారు.

మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బుర్ర ప్రవంతి తన రెండో గర్భధారణలో కేవలం ఏడు నెలల గర్భంతో గత నెల 8వ తేదీన అకస్మాత్తుగా ప్రసవ వేదనలు రావడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సాధారణ ప్రసవం నిర్వహించగా మగ శిశువు జన్మించాడు. అయితే శిశువు కేవలం 1.4 కిలోల బరువుతో జన్మించడంతో పాటు ఊపిరి సరిగా పీల్చుకోలేని పరిస్థితిలో ఉండటంతో వెంటనే ప్రత్యేక వైద్య చికిత్స ప్రారంభించారు.

శిశువుకు శ్వాసకోశ సంబంధిత సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రిలో దాదాపు 12 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు. ఆరోగ్యం కొంత మెరుగుపడినట్లు భావించి ఇంటికి పంపించినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు.

గురువారం ఉదయం శిశువు ఆరోగ్యం ఒక్కసారిగా విషమించింది. పాలు తాగకపోవడం, ఏడవకపోవడం, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడటం, శరీరం నీరసించడంతో కుటుంబ సభ్యులు వెంటనే మరోసారి కామారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి మరింత క్లిష్టంగా మారడంతో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు శిశువుకు తీవ్ర శ్వాసకోశ సమస్యతో పాటు ఫిట్స్ (మూర్ఛలు) కూడా వస్తున్నాయని గుర్తించారు. శిశువుకు మరింత ఉన్నత స్థాయి వైద్యం అవసరమని భావించి వెంటనే హైదరాబాద్‌లోని నిలోఫర్ ప్రభుత్వ చిన్నారుల ఆస్పత్రికి రిఫర్ చేశారు.

వెంటనే కామారెడ్డి 108 నియోనేటల్ అంబులెన్స్‌ను అప్రమత్తం చేయగా ఈఎంటీ కృష్ణస్వామి, పైలట్ విజయ్‌కుమార్ క్షణాల్లో స్పందించి శిశువును అంబులెన్స్‌లోకి తరలించారు. హైదరాబాద్ వరకు సుమారు మూడున్నర గంటల ప్రయాణం మొత్తం శిశువుకు ఒక్క క్షణం కూడా విరామం లేకుండా వైద్య సహాయం అందించారు.

ప్రయాణ సమయంలో శిశువుకు స్వయంగా శ్వాస తీసుకోవడం సాధ్యం కాకపోవడంతో ఈఎంటీ కృష్ణస్వామి నిరంతరం అంబు బ్యాగ్ ద్వారా కృత్రిమ శ్వాస అందిస్తూ, ఆక్సిజన్ సపోర్ట్ కొనసాగించారు. అవసరమైన ఐవీ ద్రావణాలు అందిస్తూ, శిశువు ప్రాణాధార సంకేతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించారు. అంబులెన్స్‌ను పైలట్ విజయ్‌కుమార్ వేగంగా, అదే సమయంలో సురక్షితంగా నడిపిస్తూ సమయానికి నిలోఫర్ ఆస్పత్రికి చేర్చారు.

నిలోఫర్ ఆస్పత్రికి చేరుకున్న వెంటనే శిశువును వైద్యులకు అప్పగించి తదుపరి చికిత్స కోసం చేర్పించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా 108 సిబ్బంది చూపిన చొరవ, సమయస్ఫూర్తి, సేవాభావం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా శిశువు తండ్రి చంద్రగౌడ్ మాట్లాడుతూ, తమ బిడ్డ పరిస్థితి అత్యంత విషమంగా ఉన్న సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది దేవుడిలా వచ్చి నిరంతర వైద్య సహాయం అందించారని భావోద్వేగానికి గురయ్యారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వరకు ఒక్క క్షణం కూడా నిర్లక్ష్యం చేయకుండా సేవలు అందించిన ఈఎంటీ కృష్ణస్వామి, పైలట్ విజయ్‌కుమార్లకు, అలాగే 108 అత్యవసర వైద్య సేవల సిబ్బందికి కుటుంబ సభ్యుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా నెలలు నిండక జన్మించిన శిశువులకు 108 నియోనేటల్ అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమని, సమయానికి అందే వైద్య సహాయం వల్ల విలువైన ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత అత్యవసర సేవలను ప్రజలు అవసరమైన సందర్భాల్లో సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

# కల్తీ కల్లు విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

ఆల్ప్రాజోలామ్ మత్తు పదార్థంతో కల్తీ చేసిన 60 కల్లు సీసాలు స్వాధీనం

ఇద్దరు వినియోగదారుల వైద్య పరీక్షల్లో బెంజోడయాజెపైన్ పాజిటివ్

నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

వివరాలు వెల్లడించిన సదాశివ నగర్ సీఐ సంతోష్ కుమార్




**కామారెడ్డి టౌన్ ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లాలో కల్తీ కల్లు విక్రయిస్తున్న ముఠాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. వినియోగదారులను మత్తుకు బానిసలుగా మార్చే ఉద్దేశంతో కల్లులో ఆల్ప్రాజోలామ్ అనే సైకోట్రోపిక్ మత్తు పదార్థాన్ని కలిపి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 60 కల్తీ కల్లు సీసాలు, రెండు మొబైల్ ఫోన్లు తదితర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని కరడ్‌పల్లి గ్రామంలో ఉన్న ఓ కల్లు దుకాణంపై తాడ్వాయి ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కల్లు విక్రేత సీతూరి అలియాస్ గౌండ్ల పోచగౌడ్ (50)ను అదుపులోకి తీసుకుని దుకాణాన్ని సోదా చేయగా, వినియోగదారులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 60 కల్లు సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో కల్లులో ఆల్ప్రాజోలామ్ అనే ప్రమాదకరమైన మత్తు పదార్థాన్ని కలిపి విక్రయిస్తున్నట్లు బయటపడింది. అదే సమయంలో దుకాణంలో కల్లు సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులకు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్ పరీక్షల్లో బెంజోడయాజెపైన్ పాజిటివ్‌గా తేలింది. అనంతరం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి నిర్వహించిన వైద్య పరీక్షల్లో కూడా బెంజోడయాజెపైన్ వినియోగించినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు విస్తరించిన పోలీసులు కల్లు దుకాణం లైసెన్స్ హోల్డర్ కొండాపురం స్వామిగౌడ్ (36)ను గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అక్రమంగా అధిక లాభాలు ఆర్జించేందుకు కల్లులో ఆల్ప్రాజోలామ్ కలిపి విక్రయించినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఇద్దరు నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీసులు ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాలు కలిపిన ఆహార పదార్థాలు, పానీయాలు లేదా కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు ఎక్కడైనా సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతో సమాజ ఆరోగ్యానికి హానికరమైన ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవ వేడుకలు

**పోడు రైతులపై అటవీ అధికారుల దాడులు ఆపాలి**

**ఆదివాసి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి**

**తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం(ఎంఊా) జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం.**

**వేమనపల్లి :** మండల కేంద్రంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (ఎంఊా) ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాలు నిర్వహించడం జరిగింది ముందుగా సంఘం జండాను సంఘం మండల అధ్యక్షుడు మడే మదనయ్య ఆవిష్కరించారు ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాగాల రాజన్న ఎర్మ పున్నం హాజరై మాట్లాడుతూ ఆదివాసి దినోత్సవ స్ఫూర్తిని గ్రామ గ్రామానికి చేరవేయడం కోసం ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 6వ తేదీ నుండి ఆగస్టు 13వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందనీ ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల హక్కులను పూర్తిగా కాలరాస్తూ ఐదవ షెడ్యూల్ లో కలపడానికి అవకాశం ఉన్న గ్రామాలను కూడా గుర్తించకుండా ఆ గ్రామాలకు అన్యాయం చేస్తూ ఆదివాసులను నట్టేట ముంచేస్తున్నారని, అటవీ శాఖ అధికారులు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ పోడు వ్యవసాయం చేసుకునే ఆదివాసీలపై దౌర్జన్యాలు చేస్తూ వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం, దసలీ వ్యవసాయంపై ఆధారపడి జీవించే ఆదివాసి రైతులను వారు వేసుకున్న పట్టుపురుగులను చంపేసి ఆర్థికంగా నష్టపరుస్తున్నారు చట్టం ప్రకారం ఆదివాసులకు అడవి పై ఆధారపడి జీవించే హక్కులు ఉన్నప్పటికీ దుర్మార్గంగా వ్యవహరిస్తూ అటవీశాఖ అధికారులు ఆదివాసులను ఒక దొంగల లాగా చేస్తూ అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. అటవీ అధికారుల ఆంక్షల మూలంగా ఆదివాసి గ్రామాలకు కనీస సదుపాయాలు రోడ్డు కూడా వేయనువ్వడం లేదన్నారు

## ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...

**హైదరాబాద్ :** ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు.ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ.1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు.2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు.

# కారోబార్లకు ప్రత్యేక హోదా కల్పించాలి



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)** హైదరాబాదులో బి ఆర్ కే ఆర్ భవన్ నందు సీతక్క మినిస్టర్, కమిషనర్ రాష్ట్రవ్యాప్తంగా కారబార్ల సమీక్ష సమావేశము జరిపి జీ.వో నెం.51 నుండి మినాయింపు చేసీ,కారోబార్ లకు ప్రత్యేక హోదా ఇచ్చుటకు చర్చలు, మంత్రి సీతక్క వారం రోజులలో జీవో విడుదల చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు. ఆర్ దుర్గాగౌడ్, ఉపాధ్యక్షులు.జే.ప్రభాకర్, కార్యదర్శి.పిల్లి.యాదగిరి, సభ్యులు.నామాల.శంకర్ పాల్గొన్నారు.

## బిజినెస్

### తగ్గుతున్న ముడి చమురు ధరలు.. లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం పెట్టుబడిదారుల సెంటిమెంట్ కు ఊతమిచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. సెన్సెక్స్ (ాావఅంవఞ) 374 పాయింట్లు లాభపడి 78,954.76 వద్ద ముగిసింది. నిఫ్టీ (చీఱఛ్‌ఎ) 11.35 పాయింట్లు పెరిగి 24,636 వద్ద స్థిరపడింది. నిఫ్టీ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మరోవైపు రియల్టీ, మీడియా, ఆటో రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.48 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లు మాత్రం మార్కెట్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు అనుకూల పరిణామమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. దిగుమతి వ్యయం తగ్గడంతోపాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్‌కు ఇది మద్దతుగా నిలిచిందని విశ్లేషిస్తున్నారు.

### హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్




**న్యూఢిల్లీ :** టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. దేశంలో తమ నాల్గో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చినట్టు గురువారం ప్రకటించింది. దీంతో నగరం నుంచి వీలైన మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలు, వర్క్‌లోడ్‌లను నడిపించడానికి ఇక కస్టమర్లకు అవకాశం లభించిందని పేర్కొన్నది. ఇప్పటికే కంపెనీకి పుణె, చెన్నై, ముంబైలు క్లౌడ్ రీజియన్‌లుగా ఉన్నాయి. దీంతో ఇప్పుడు వీటికి హైదరాబాద్ తోడైంది. కాగా, భారత్‌లో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టేందుకు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. అందులో భాగంగానే ఈ క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది.

# బంగారంపై 85% వరకు లోన్..
# ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఆఫర్!



అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైతే.. చాలామంది తమ వద్ద ఉన్న బంగారంపై లోన్ తీసుకోవాలనుకుంటారు. అలాంటి వారికి ముత్తూట్ ఫైనాన్స్ ఒక మంచి గోల్డ్ లోన్ ఆఫర్ అందిస్తోంది. ఇందులో మీరు.. మీ బంగారం విలువలో 85 శాతం వరకు లోన్ తీసుకునే అవకాశం ఉంది.

వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వ్యాల్యూ, స్పీడ్, సేవింగ్స్ అనే మూడు ప్రధాన ప్రయోజనాలను అందిస్తున్నట్లు ముత్తూట్ ఫైనాన్స్ వెల్లడించింది. తక్కువ సమయంలోనే లోన్ అందించడం, సులభమైన ప్రక్రియతో సేవలు అందించడం తమ ప్రత్యేకత అని సంస్థ చెబుతోంది.

గోల్డ్ లోన్ కోసం దరఖాస్తు చేయాలనుకునే వారు మొబైల్ నెంబర్, పిన్‌కోడ్ ఎంటర్ చేసి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించవచ్చు. సంస్థ నిబంధనలు, షరతులకు అంగీకరించిన తర్వాత దరఖాస్తు పూర్తి చేయవచ్చు.

**ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ప్రత్యేకత**

ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ప్రత్యేకత ఏమిటంటే.. లోన్ అందించే ప్రక్రియ చాలా వేగంగా ఉండటం. బంగారం విలువను అంచనా వేసిన వెంటనే లోన్ అందించే విధానాన్ని సంస్థ అనుసరిస్తోంది. అంతే కాకుండా.. వడ్డీ రేట్లు, కస్టమర్‌కు అనుకూలమైన సేవలతో మంచి గుర్తింపు పొందింది. దేశంలోనే అత్యధిక గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో కలిగిన సంస్థగా ముత్తూట్ ఫైనాన్స్ రికార్డ్ క్రియేట్ చేసింది. ముత్తూట్ ఫైనాన్స్ దేశవ్యాప్తంగా 7,500కు పైగా శాఖలతో సేవలు అందిస్తోంది. రోజూ 2.5 లక్షలకు పైగా వినియోగదారులు తమ సేవలను వినియోగిస్తున్నారని, కేవలం ఒక్కసారి శాఖను సందర్శిస్తే వెంటనే గోల్డ్ లోన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని కంపెనీ తెలిపింది.

వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంస్థ +శీశ్రీస ాశ్ఖీఅఏఎశీఎవ అనే ప్రత్యేక సేవను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవ ద్వారా ఇంటి నుంచే గోల్డ్ లోన్ పొందే అవకాశం ఉంది. దీనికోసం ముందుగా లోన్ కోసం రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత సంస్థ ప్రతినిధులు ఇంటికే.. వచ్చి బంగారం విలువను అంచనా వేస్తారు. ఆ తర్వాత డబ్బు నేరుగా వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీంతో శాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. ఇంటి నుంచే సౌకర్యవంతంగా లోన్ పొందవచ్చు.

# ఎల్ఐసీ లాభం 13,492 కోట్లు..
# క్యూ1లో 23 శాతం పెరిగిన ప్రాఫిట్




**న్యూఢిల్లీ :** బీమా సేవల సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.13,492 కోట్ల నికర లాభా న్ని గడించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.10,987 కోట్లతో పోలిస్తే 23 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో సంస్థ రూ.2,37,848 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది రూ.2,22,864 కోట్లుగా ఉన్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంతో తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.7,525 కోట్ల నుంచి రూ.9,217 కోట్లకు పెరిగాయి. అలాగే రెన్యువల్ ప్రీమియం వసూళ్లు కూడా 59,885 కోట్ల నుంచి రూ.61,833 కోట్లకు పెరుగగా, సింగిల్ ప్రీమియం వసూళ్లు రూ.56,369 కోట్లుగా ఉన్నాయి. దీంతో నికర ప్రీమియం ఆదాయం రూ.1,19,200 కోట్ల నుంచి రూ.1,27,250 కోట్లకు పెరిగాయి. మరోవైపు, నిర్వహణ ఖర్చులు రూ.2,11,928 కోట్ల నుంచి రూ.2,25,573 కోట్లకు చేరుకున్నట్టు తెలిపింది.

**వాటా విక్రయించే యోచన లేదు..**

వచ్చే ఏడాదిన్నరలోగా సంస్థలో వాటా విక్రయించేయోచనలో కేంద్ర ప్రభుత్వం లేదని ఎల్ఐసీ సీఈవో, ఎండీ ఆర్ దొరైస్వామి స్పష్టంచేశారు. ఇటీవల ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 6.5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం విక్రయించిన విషయం తెలిసిందే. సెబీ మార్గదర్శకాల ప్రకారం సంస్థలో ప్రజలు 25 శాతం వాటా కలిగివుండాలనే ప్రతిపాదనపై ఆయన స్పందిస్తూ..వచ్చే 18 నుంచి 24 నెలల్లో కేంద్రం మరోదఫా వాటా విక్రయించేయోచనలో లేదని, ఇప్పటికే 10 శాతం వాటాను విక్రయించినట్టు చెప్పారు.

# కొత్త కలయికలో ఇంగ్లండ్‌కు తొలి పరీక్ష..
# పోప్, లారెన్స్‌కు పిలుపు..!




కొత్త కోచ్, కొత్త కెప్టెన్ నేతృత్వంలో ఇంగ్లండ్ జట్టు తొలి పరీక్షకు సిద్ధమవుతోంది. జో రూట్ సారథ్యం, స్టీఫెన్ ఫ్లెమింగ్ కోచింగ్‌లో మొట్టమొదటి టెస్టు సిరీస్ ఆడుతున్న ఇంగ్లండ్ స్క్వాడ్‌ను ప్రకటించింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో మూడు టెస్టుల సిరీస్ కోసం గురువారం ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు() పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. తొలి రెండు మ్యాచ్‌లకు యువకెరటం జాకబ్ బెథెల్ దూరమవ్వగా.. సీనియర్ ఓలీ పోప్ స్క్వాడ్‌లోకి వచ్చాడు.

బజ్ బాల్ ఆటకు చెల్లుచీటీ ఇచ్చిన ఇంగ్లండ్ నాయకత్వ మార్పు, కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ రాక అనంతరం తొలి పరీక్ష ఎదుర్కోనుంది. స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సవాల్‌కు కాచుకొని ఉంది జో రూట్ సేన. దాంతో, మొదటి రెండు టెస్టులకు గురువారం సెలెక్టర్లు 16 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. అయితే.. జాకబ్ బెథెల్ అనూహ్యంగా స్క్వాడ్‌కు దూరమయ్యాడు. ఇటీవల టీ20లు, వన్డేల్లో ఓపెనర్‌గా రాణిస్తున్న బెథెల్ మోకాలి గాయం కారణంగా అందుబాటులో లేడు. న్యూజిలాండ్‌తో సిరీస్ ఆడని సీనియర్ బ్యాటర్ ఓలీ పోప్, బ్రైడన్ కార్సే, డాన్ లారెన్స్ లకు అవకాశం దక్కింది. జోర్డాన్ కాక్స్ మూడో స్థానంలో ఆడనున్నాడు.

ఈమధ్యే న్యూజిలాండ్ చేతిలో 2-1తో సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ ఈసారి పంజా విసరాలనుకుంటోంది. పాకిస్థాన్‌తో ఆగస్టు 19 నుంచి హెడింగ్లేలో తొలి టెస్టు మొదలవ్వనుంది. రెండో మ్యాచ్ ఆగస్టు 27 నుంచి.. మూడోది సెప్టెంబర్ 9వ తేదీన జరుగనుంది. ఇంగ్లండ్ టెస్టు స్క్వాడ్ : బెన్ డకెట్, ఎమిలియే గే, ఓలీ పోప్, జో రూట్(కెప్టెన్), జేమీ స్మిత్(వికెట్ కీపర్), ఆర్చర్, అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, కార్సే, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, మాథ్యూ ఫిషర్, డాన్ లారెన్స్, రాబిన్సన్, టంగ్.

### ఆసియా కప్ షెడ్యూల్ విడుదల..
### సెప్టెంబర్ 5న భారత్, పాకిస్థాన్ మ్యాచ్..!

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ మళ్లీ చూసే అవకాశం రాబోతోంది. ఇటీవలే మహిళల వన్డే ప్రపంచకప్‌లో తలపడిన దాయాదులు ఈసారి ఆసియా కప్(ూాంఱఞ జబజూ 2026)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(ూజజ) తెలిపింది. గురువారం టోర్నీ షెడ్యూల్ విడుదల చేసింది ఏసీసీ. ప్రతిష్ఠాత్మక మహిళల ఆసియా కప్ షెడ్యూల్ వచ్చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని గురువారం ఆసియా క్రికెట్ మండలి వెల్లడించింది. ఆగస్టు 28 నుంచి పోటీలు మొదలవుతాయని పేర్కొన్న ఏసీసీ.. అందరూ ఆసక్తి కనబరిచే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరుగనుందని చెప్పింది.

**టాప్ -- 2 జట్లు సెమీస్‌కు**

రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగనున్న ఆసియా కప్‌లో గ్రూప్ ఏ, గ్రూప్ బీలో ఐదేసి జట్లున్నాయి. భారత్, పాకిస్థాన్, చైనా, హాంకాంగ్, థాయ్‌లాండ్ మొదటి గ్రూప్‌లో.. ఆతిథ్య యూఈఏ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియాలు గ్రూప్ బీలో ఉన్నాయి. లీగ్ దశలో పాక్‌తో పాటు చైనా,



హాంకాంగ్, థాయ్‌లాండ్‌ను టీమిండియా ఢీకొట్టనుంది.ప్రతి గ్రూప్ నుంచి టాప్ -- 2 జట్లు సెమీస్‌కు వెళ్తాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్‌తో విజేత ఎవరో తేలిపోనుంది.

## స్పోర్ట్స్

### టాప్ సీడ్‌గా అమ్మాయిల జట్టు
**చెస్ ఒలింపియాడ్‌లో అర్జున్ టీమ్‌కు రెండో సీడింగ్**




న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల జట్టు టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్ వేదికగా సెప్టెంబర్ 15నుంచి 28 వరకు జరిగే ఈ మెగా టోర్నీ ఓపెన్ సెక్షన్‌లో తెలంగాణ కుర్రాడు ఇరిగేశి అర్జున్‌తో కూడిన అబ్బాయిల జట్టు రెండో సీడ్‌గా పోటీ పడనుంది. అమెరికా టీమ్‌కు టాప్ సీడింగ్ దక్కింది. గత ఎడిషన్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలు నెగ్గి డిఫెడింగ్ చాంపియన్ల హోదాతో ఈ టోర్నీకి సిద్ధమవుతున్నాయి. ఓపెన్‌లో అమెరికాతో పాటు మూడో సీడ్, ఆతిథ్య జట్టు ఉజ్బెకిస్థాన్, చైనా, జర్మనీ, నెదర్లాండ్స్ బలమైన పోటీదారులుగా ఉన్నాయి. అమ్మాయిల జట్టుకు రెండో సీడ్ జార్జియాతో పాటు కజకిస్థాన్, చైనా నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. 46వ ఎడిషన్ ఒలింపియాడ్‌లో రికార్డు స్థాయిలో 400 జట్లు పోటీ పడనున్నాయి. ఓపెన్‌లో 208, మహిళల విభాగంలో 192 దేశాలు పోటీలో ఉన్నాయి.

### మెస్సీ మాయ మళ్లీ మొదలు..



మయామి: ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి బాధ తర్వాత అర్జెంటీనా సాకర్ లెజెండ్ లియోనల్ మెస్సీ మైదానంలో మళ్లీ మెరుపులు మెరిపిస్తున్నాడు. ఫిఫా కప్ ముగిసిన అనంతరం లీగ్స్ కప్‌లో ఇంటర్ మయామి క్లబ్ తరఫున బరిలోకి దిగిన మెస్సీ తన రెండో మ్యాచ్‌లో డబుల్ గోల్స్‌తో మ్యాజిక్ చేశాడు. దాంతో ఇంటర్ మయామి టీమ్ 4-2తో అట్లెటికో సాన్ లూయిస్‌పై విజయం సాధించింది. బుధవారం రాత్రి వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో 11వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టిన మెస్సీ.. 44వ నిమిషంలో మరోసారి బంతిని నెట్‌లోకి పంపించాడు. దాంతో ఈ టోర్నీలో మెస్సీ కొట్టిన గోల్స్ సంఖ్య 14కు (12 మ్యాచ్‌ల్లో) చేరింది. ఫలితంగా నాలుగేండ్ల ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా లాస్ ఏంజెల్స్ ఎఫ్‌సీ ప్లేయర్ డెనిస్ బౌంగా (13 గోల్స్) రికార్డును అర్జెంటీనా లెజెండ్ బ్రేక్ చేశాడు.



# ఆ భ్రమ నుంచి బయటపడాలి!

యాక్షన్‌తో పాటు తనదైన శైలిలో చక్కటి కామెడీని పండిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు హీరో వరుణ్‌తేజ్. ఆయన నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో హారర్, సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ సంస్థలు నిర్మించాయి. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ ఇదని, రెండున్నర గంటల పాటు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతుందని వరుణ్‌తేజ్ చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన విలేకరులతో ముచ్చటించారు. దర్శకుడు గాంధీ ఈ కథ చెప్పినప్పుడు నవ్వుతూనే ఉండిపోయా. కోవిడ్ తర్వాత ఎక్కువగా సీరియస్, యాక్షన్ సినిమాలొచ్చాయి. ఎప్పటి నుంచో హాస్య ప్రధానంగా ఓ సినిమా చేయాలనుకుంటున్నా. ప్రేక్షకుల్ని రెండున్నర గంటల పాటు నవ్వించాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాను.

పొడవుగా, భారీ కటౌట్‌తో కనిపించే హీరోలకు కామెడీ సినిమాలు అంతగా సెట్‌కావనే అభిప్రాయం ఉంది. ఆ భ్రమ నుంచి బయటకు రావాలి. నిజానికి నటుడు అన్ని రకాల పాత్రలు చేయాలి. పాత్రను సరిగ్గా డిజైన్ చేస్తే అద్భుతంగా కామెడీ పండుతుంది. 'కొరియన్ కనకరాజు'లో యాక్షన్‌తో పాటు కామెడీ కూడా బాగా కుదిరింది.

ఈ సినిమా ప్రమోషన్స్‌ని చాలా కొత్తగా నిర్వహించాం. కంటెంట్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేశాం. ట్రైలర్‌లోనే కథ మొత్తం చెప్పి ప్రేక్షకుల్ని సినిమా కోసం ముందస్తుగా ప్రిపేర్ చేశాం. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలకు కూడా సరిపడా సమయం దొరకడంతో సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. దాంతో విజయంపై ధీమా పెరిగింది.

ఈ సినిమా కోసం కొరియన్ భాష నేర్చుకున్నా. నాకు కొత్త పాత్రలు చేయడం, కొత్త వ్యక్తిలా జీవించడం చాలా ఇష్టం. ప్రతి పాత్రలో నేను కనిపించకుండా..నా క్యారెక్టర్ మాత్రమే కనిపించేలా కష్టపడతాను. ఈ సినిమాలో నా పాత్ర రెండు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. నటుడిగా ఛాలెంజింగ్ రోల్ చేసినందుకు సంతృప్తిగా ఉన్నా. ఇందులో నా హెయిర్‌స్టైల్ మొదలుకొని బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ...ఇలా ప్రతీ విషయం కొత్తగా అనిపిస్తుంది.

ఈ సినిమా ప్రీమియర్‌షోస్ బుకింగ్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. ఓవర్‌సీస్‌లో కూడా సూపర్‌రెస్పాన్స్ వస్తున్నది. ప్రచార చిత్రాల ద్వారా సినిమా కంటెంట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయింది. సినిమా కూడా అందరి అంచనాలకు తగినట్లుగా ఉంటుంది. నా తదుపరి సినిమా 'బరి' తాలూకు ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. పూర్తి స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథ ఇది. నేను చిన్నప్పటి నుంచి వాలీబాల్ ఆడేవాడిని. అది ఈ సినిమాకు బాగా హెల్ప్ అవుతున్నది. ఇందులో మా నాన్న కూడా కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆయనతో కలిసి నటించాలనే కోరిక 'బరి' సినిమాతో నెరవేరబోతున్నది.



# 100 కోట్ల వ్యూస్‌తో చరిత్ర సృష్టించిన 'రామాయణ' ట్రైలర్

నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ: పార్ట్-1' ట్రైలర్ అన్ని భాషలు, డిజిటల్ వేదికలు కలిపి 100 కోట్ల (1 బిలియన్) వ్యూస్ సాధించి భారతీయ సినీ చరిత్రలో అరుదైన రికార్డు నెలకొల్పింది. ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా ట్రైలర్ ఈ ఘనత సాధించలేదు. హిందీ ట్రైలర్ ఒక్కటే 'వరల్డ్ ఆఫ్ రామాయణ' ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 588 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర వేదికల్లో కూడా భారీ స్పందన లభించింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర ట్రైలర్ అద్భుతమైన విజువల్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాన్స్ జిమ్మర్--ఏ.ఆర్. రెహమాన్ సంగీతంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రబృందం ఇంగ్లిష్ ట్రైలర్‌ను కూడా విడుదల చేసింది. అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఏఐ ఆధారిత సరికొత్త లిప్-సింక్ టెక్నాలజీని ఉపయోగించి ఈ వెర్షన్‌ను రూపొందించారు. అంతేకాకుండా, ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా సోనీ పిక్చర్స్ విడుదల చేయనుండటం విశేషం.

# ఫ్యామిలీ యాక్షన్ డ్రామా

విక్రమ్ సహిదేవ్, సంధ్యావశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం'అనకాపల్లి' త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటుడు సోనూసూద్ ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. తన సొంత ఊరు అనకాపల్లిలో ఈ వేడుక జరగడం ఆనందంగా ఉందని, ఫ్యామిలీ..యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత త్రినాథరావు నక్కిన తెలిపారు. అనకాపల్లిలోని రియల్ లొకేషన్లలో షూటింగ్ చేశామని నిర్మాత కాండ్రేగుల నాయుడు చెప్పారు. ఈ వేడుకలో చిత్రబృందమంతా పాల్గొన్నారు.






## కాకులు తల్వార్లు పడితే..

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సికింద్రాబాద్ నేపథ్య పీరియాడిక్ చిత్రం 'ది ప్యారడైజ్'. నిర్మాణ దశ నుంచే ఈ సినిమా భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో జడల్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాని కనిపించబోతున్నారు. 'ఈ జాగా ఎవరిది? ఈ దేశమెవరిది? అంటూ నాని బిగ్గరగా నినాదాలు చేస్తూ తన వారిలో చైతన్యాన్ని రగిల్చే సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. ప్యారడైజ్ తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ తన జాతి జనుల కోసం ఆధిపత్య శక్తులతో పోరాడే యువకుడిగా నాని పాత్రను శక్తివంతంగా చూపించారు. 'అణచబడ్డ మన జాతి మర్లబడాలే..ఛీ అని చీదరించుకున్న నలుపురంగే మన జెండా. కాకి దానిమీద గుర్తు. కాకులు తల్వార్లు పడితే ఏమవుతుందో చూపిద్దాం' అంటూ నాని చెప్పిన సంభాషణలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# 20 నిమిషాల ఎపిసోడ్ కోసం 60 రోజుల షూటింగ్..

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా పాన్ వరల్డ్ స్థాయిలో అత్యంత భారీ బడ్జెట్‌తో 'వారణాసి' అనే చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు మహేశ్‌బాబు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణం ఎపిసోడ్‌లో రాముడిగా మహేశ్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుందని సమాచారం. తెరపై కనిపించే ఈ 20 నిమిషాల ఎపిసోడ్ చిత్రీకరణకు దాదాపు 60 రోజులు పట్టిందట. ఇక ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం వరకు ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరగ్గా, మహేశ్ పాల్గొన్నారట. ఆ తర్వాత చిన్న బ్రేక్ తీసుకుని వెకేషన్ వెళ్లారు. మరి... బర్త్ డే సందర్భంగా 'వారణాసి' చిత్రం నుంచి మహేశ్‌బాబు ప్రత్యేక పోస్టర్‌ని కానీ వేరే ఏదైనా అప్‌డేట్ కానీ ఇస్తారేమో చూడాలి. ఎస్ఎస్ కార్తికేయ, కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది. దాదాపు 120 దేశాల్లో 'వారణాసి'ని రిలీజ్ చేయనున్నారు.



### విదేశాల్లో బర్త్‌డే సెలెబ్రేషన్స్

నటుడిగా ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీకి తగినంత సమయాన్ని కేటాయిస్తుంటారు మహేశ్‌బాబు. షూటింగ్స్‌కి గ్యాప్ దొరికినప్పుడు ఫ్యామిలీతో వెకేషన్ ప్లాన్ చేసుకుంటారు. ప్రస్తుతం తన కుటుంబంతో సహా మహేశ్ విదేశాల్లో ఉన్నారు. ఈ నెల 9న ఈ హీరో పుట్టినరోజు. సో... బర్త్ డే వేడుకను అక్కడే జరుపుకుంటారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకుని 'వారణాసి' సినిమా షూట్‌లో పాల్గొంటారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967